క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్

అద్దంకి: పట్టణంలోని రెండో వార్డులోని కాకాని పాలేనికి చెందిన జాగర్లమూడి నరేంద్ర ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా గురువారం అందజేశారు. నగదును మున్సిపల్ వైస్‌చైర్మన్ కన్నెబోయిన అనంతలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చీరాల అర్బన్: చీరాలలోని వీఆర్ఎస్‌వైఆర్ఎన్ డిగ్రీ కాలేజీ 1974–1977 బ్యాచ్ బీఏ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం చీరాల వాడరేవులోని బ్రహ్మాస్ గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. 50 సంవత్సరాల తర్వాత అప్పటి పూర్వ విద్యార్థులందరూ ఒక చోట సమ్మేళనమవుతున్నారన్నారు. బ్యాచ్‌లోని పూర్వ విద్యార్థులు ప్రస్తుతం వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో నిలిచి ఉద్యోగవిరమణలు చేశారన్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులందరూ తప్పక హాజరుకావాలన్నారు.

హనిమిరెడ్డిని కలిసిన పంచాయతీరాజ్ ఎస్ఈ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈ హరే రామకృష్ణ

అద్దంకి: వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డిని పంచాయతీరాజ్ ఎస్ఈ హరేరామకృష్ణ గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మార్యాపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారితో పాటే ఏఈ వెంకట్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని హనిమిరెడ్డి ఎస్ఈతో చెప్పారు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు

చీరాల టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించేలా అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. గురువారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాలను ఎంపీడీవో తనిఖీ చేసి పెండింగ్ అర్జీలను విచారించారు. గ్రామ సచివాలయాల వారీగా వచ్చిన అర్జీలు, విచారించిన అర్జీలను పరిశీలించి సూచనలు అందించారు. ఎంపీడీవోతో పాటు ఈవోఆర్డీ మురళీబాపూజీ, సచివాలయాల సెక్రటరీలు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

యద్దనపూడి: మండల కేంద్రం యద్దనపూడిలో పలు సమస్యలను పరిష్కరించాలని గురువారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లెపోగు రాంబాబు వినతి పత్రం అందించారు. యద్దనపూడి గ్రామంలో సర్వే నంబర్ 248లో సుమారు 7.98 ఎకరాల విస్తీర్ణంలో గత 30 ఏళ్ల క్రితం ఇంటి స్థలం లేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్థలం కేటాయించినప్పటికీ చూపించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆయుర్వేదం ప్రజల జీవన వేదం

బల్లికురవ: ఆయుర్వేదం ప్రజల జీవన వేదమని దీర్ఘకాలిక వ్యాధులకు సైతం ఎలాంటి నష్టం లేకుండా నయం చేయవచ్చని అంబడిపూడి ఆయుష్ వైద్యశాల ఫార్మసిస్టు వీ. శేషసాయి అన్నారు. గురువారం వల్లాపల్లి ఎయిడెడ్ పాఠశాలలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహనతో మందులు పంపిణీ చేశారు. రోగనిరోధక శక్తి పెంపునకు చవన్‌ప్రాష్, జలుబు, దగ్గుకు హారితి రసాయనం, జ్వరం, వళ్లు నొప్పులకు ఆయుష్-64 వాడే విధానాన్ని శేషసాయి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాదం రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

బల్లికురవ: అద్దంకి మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం శింగరకొండలోని వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు 50 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు అద్దంకి అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్, శ్రీనివాసరావు, పార్థసారధి, నూతలపాటి సురేష్, పోలయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం



వేటపాలెంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై సురేష్, సిబ్బంది



కొణిదెనలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు



చీరాలలో స్వాధీనం చేసుకున్న క్వార్టర్ బాటిళ్లను చూపుతున్న ఎస్సై జనార్దన్

వేటపాలెం: ఇంట్లో అక్రమంగా మద్యం ఉంచి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై సురేష్ వివరాల మేరకు.. ఎస్సై మాట్లాడుతూ అయోధ్యనగర్ లో నివాసం ఉంటున్న మేడ అంజమ్మ ఇంట్లో మద్యం విక్రయాల కోసం దాచి ఉంచిన 80 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన కామంచి నాగరాజు చిల్లరకొట్టు నడుపుతున్నాడు. కొట్టులో దాచి ఉంచిన 16 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. అనంతరం ఇద్దరి నిందుతులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. మొత్తం 96 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచి వ్యాపారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

కొణిదెనలో బెల్టు షాపుపై దాడి..

బల్లికురవ: బెల్టు షాపు నిర్వహిస్తు మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు సమాచారంతో గురువారం సాయంత్రం బల్లికురవ ఎస్సై వీ. వేమన సిబ్బందితో దాడులు చేపట్టారు. కొణిదెన గ్రామంలో షేక్ మౌలాలి ఇంట్లోనే బెల్టు షాపు నిర్వహిస్తూ, రాష్ట్రంతోపాటు పరాయి రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఈదాడిలో 9 మద్యం బాటిళ్లను స్వాధీన పరుచుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

చీరాల: అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గురువారం ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్ స్వాధీనం చేసుకున్నారు. చీరాల మండలం విజయలక్ష్మీపురంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచారనే సమాచారంతో ఈపూరుపాలెం ఎస్సై జనార్దన్ మెరుపుదాడి చేసి గవినివారిపాలేనికి చెందిన యెనుముల సుబ్బాయమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశారు. ఎక్కడైనా మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాభివృద్ధికి సహకారాలు అందిస్తా



స్థానిక పెద్దలతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి

● నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి

సంతమాగులూరు(అద్దంకి): ముస్లింలకు నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కొమ్మాలపాడులో నిర్మాణంలో ఉన్న దర్గా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా నేను ఉన్నానని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎవరైనా ఏ సమయంలోనైనా ఫోన్ చేసి మాట్లాడి తమ సమస్యను చెప్తే వింటానన్నారు. ఒకరికొరు పోటీ పెట్టుకోకుండా ఎవరి పనులు వారు చేయించుకోవాలని చెప్పారు. రాబోయో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా నియోజకవర్గంలో ఎగిరే విధంగా చేయాలని కోరారు. కుందర్రు గ్రామంలో వెంకాయమ్మ మృతదేహానికి నివాళి అర్పించారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న సుభానీని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామ పెద్దలు, మండల నాయకులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు నూతన పింఛన్ల పంపిణీ

చీరాల టౌన్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో నూతనంగా మంజూరైన వైఎస్సార్ నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కే నేతాజీ గురువారం తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో జరిగే నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి పంపిణీ చేస్తారని ఎంపీడీవో చెప్పారు. లబ్ధిదారులు అందరు విధిగా హాజరుకావాలని సూచించారు. అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు సచివాలయాల ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు అందరూ లబ్ధిదారులతో కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

నేడు అద్దంకిలో నూతన పెన్షన్‌ల పంపిణీ..

అద్దంకి రూరల్: అద్దంకి మండల పరిధిలోని నూతన పెన్షన్ లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దేవసేనకుమారి గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. కావున గ్రామాల్లోని లబ్ధిదారులు పాల్గొన్నాలని కోరారు.

నేడు నూతన పింఛన్లు పంపిణీ..

కారంచేడు: నేడు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నూతన పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన జరగబోవు కార్యక్రమంలో అన్ని గ్రామాలకు చెందిన నూతన పింఛన్‌దారులకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున ప్రభుత్వం పింఛన్ అందిస్తుందన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండలశాఖ అధికారులు, గ్రామ కార్యదర్శులు, వలంటీర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఆశాజనకంగా వరి దిగుబడులు



పంటకోత ప్రయోగంలో వరి ధాన్యం కాటా వేస్తున్న అధికారులు

వేటపాలెం: మండల పరిధిలో ఈ ఏడాది వరి దిగుబడులు ఆశాజనంగా ఉన్నాయని డివిజనల్ స్టాటికల్ అధికారి (డీవైఎస్ఓ) చాముండేశ్వరి తెలిపారు. గురువారం చల్లారెడ్డిపాలెం సచివాలయం -2 పరిధిలోని వరి పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ పంట కోత ప్రయాగం ద్వారా నమోదైన లెక్కల ప్రకారం ఎకరా పొలంలో సాగు చేసిన వరి ధాన్యం 30 నుంచి 35 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేశామని తెలిపారు. పంట కోత ప్రయోగాలతో రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. పంటకోత ప్రయోగాల వలన రైతు సరాసరి దిగుబడి గ్రామ సరాసరి దిగుబడి, రాష్ట్ర సరాసరి దిగుబడి అంచనా వేయటకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ దిగుబడి అనుసరించి వ్యత్యాసం ఉంటే రాష్ట్ర సరాసరి దిగుబడి నుంచి ఉన్న వ్యత్యాసానికి ఉచిత పంటల బీమా వర్తింపు జరుగుతుందని చెప్పారు.

ఉచిత బీమా ఈ-క్రాప్‌కి అనుసంధానంగా ఉంటుందన్నారు. పంటలు సాగు చేసే రైతులందరూ తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్, అనిల్, గోపి, జ్యోతి, సాంబశివరావు పాల్గొన్నారు.

అయ్యప్ప భజనలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఆశీర్వచనం అందుకుంటున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: పట్టణంలోని రామమందిరం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం రాత్రి జరిగిన అయ్యప్ప భజన కార్యక్రమానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, చిన్ని లీలాధరరావు, కాకరపర్తి సత్యనారాయణ, తిరువీధుల రవికుమార్, తల్లం సాయి, రాయవరపు స్వామి, పి.హరిబాబు, అర్వపల్లి లీల, చుండూరు లక్ష్మీనారాయణ, కాకరపర్తి వెంకట సుబ్బారావు, బదరీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆయోధ్య రాముడి అక్షతలు పంపిణీ



రామన్నపేటలో అయోధ్య రాముని అక్షతలతో ప్రజలు



వెల్లలచెరువులో అక్షతలు ఎత్తుకుని గ్రామోత్సం నిర్వహిస్తున్న భక్తులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలం వెల్లలచెరువు గ్రామానికి గురువారం అయోధ్య రాములవారి అక్షతలు చేరుకున్నాయి. వెంకటేశ్వర దేవాలయంలో ఉంచి అక్కడ నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చింతారామారావు, చింతా శ్రీధర్‌బాబు, యర్రంరెడ్డి శ్రీనివాసరెడ్డి, చితిరాల అనంతరామయ్య, మోటుపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో

వేటపాలెం: రామన్నపేటలోని లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి దేవస్థానం వద్ద జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాము ని అక్షతలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు చల్లా రామారావు మాట్లాడుతూ 500 కుటుంబాలకు అక్షతలు పంపిణీ చేశామని తెలిపారు. ఈనెల 22వ తేదీన శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. అదే రోజు ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమలాదేవి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీపై కేసు

మేదరమెట్ల: తాళం వేసిన ఇంట్లోకి దొంగలు దూరి నగలు, నగదు దోచుకెళ్లారు. ఈఘటన కొరిశపాడు మండలంలోని రాచపూడి గ్రామానికి చెందిన మామిళ్లపల్లి సాంబయ్య ఇంట్లో జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. సాంబయ్య తన భార్యతో కలసి ఉదయం పొలం పనుల కోసం ఇంటికి తాళం వేసి గురువారం ఉదయం బయటకు వెళ్లారు. తిరిగి 11.30 ప్రాంతంలో ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం తీసిఉందని, బీరువాలోని నగలు, నగదు దొంగలు పడి దోచుకుపోయినట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జీవీచౌదరి తెలిపారు.

పారదర్శంగా లెప్రసీ, ఫైలేరియా సర్వే



ఆశ వర్కర్‌కి చీరలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి శ్యాంసన్

వేటపాలెం: లెప్రసీ, ఫైలేరియా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని పీహెచ్‌సీ అధికారి శ్యాంసన్ పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి లెప్రసీ వ్యాధి లక్షణాలైన స్పర్శలేని రాగి మచ్చలు ఉంటే వాటిని గుర్తించి సమాచారం అందించాలని తెలిపారు. అటువంటి వారికి వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈనెల 8 ,9, 11 తేదీల్లో గ్రామాల్లో ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి (ఫైలేరియా) బోదకాల వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఫైలేరియా బోదకాలు దోమ కాటు వల్ల వస్తుందని చెప్పారు. దోమ కుట్టిన వారికి ఎటువంటి లక్షణాలు కనిపిస్తాయనే దానిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. దాన్ని వెంటనే గుర్తించడం వల్ల ప్రాథమిక స్థాయిలోనే దాన్ని నివారించు కోవచ్చని తెలిపారు. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆశ వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గురవమ్మ, సూపర్‌వైజర్ సుధాకర్, హెచ్‌వీ మార్తమ్మ, హసన్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జే.పంగులూరు: డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం బి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పంగులూరు వెలుగు కార్యాలయంలో గురువారం వీఓఏలకు లక్‌పతి దీదీ యాప్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ వీఓఏలు డ్వాక్రా మహిళలు తీసుకున్న లోన్లకు సంబంధించి వారు ఆర్థికంగా ఎదిగేలా చూసుకోవాలని తెలిపారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఏపీఎం జ్యోతి ప్రసాద్, సీసీలు శ్రీనివాసరావువీ వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ చిరస్మరణయుడు



విద్యార్థులకు బ్రెయిలీ లిపిపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

జే.పంగులూరు: అంధుల లిపి కనుగొన్న లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయుడని హెచ్ఎం హెచ్ఎం బీ లలితకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని పంగులూరు భవితా కేంద్రంలో గురువారం ఘనంగా లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎం బీ లలితకుమారి మాట్లాడుతూ అందుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. అంధులకు చదువు చెప్పాలంటే వారికి పుస్తకాలు కావాలి. కంటితో వారు చూడలేరు. స్పర్శ తప్ప మరో మార్గంలో వారు చదువుకోలేరు. అలాంటి వారి కోసం లూయిస్ బ్రెయిలీ లిపి కనుగొన్నాడు. మొత్తం భాషకు 250 గుర్తులు. ఈ ఆరు చుక్కలతో బ్రెయిలీ రూపొందించారు. కార్యక్రమంలో ముందుగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మస్తాన్‌వలి, దిలీప్, డి హేమ, పి యోహాన్, టి అరుణ, కల్పన పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్ఎం మృతికి సంతాపం



కృష్ణారెడ్డికి నివాళులర్పిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

చీరాల అర్బన్: పట్టణంలోని విఠల్‌నగర్‌లోని ఎస్ఏఆర్ఆర్ఎం హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన ఎం.కృష్ణారెడ్డి హఠాన్మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం చీరాల యూనిట్ సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు. బుధవారం ఆయన మరణించగా గురువారం రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన కాలంలో ఉపాధ్యాయులు అజాతశత్రువుగా ఆయనను పిలిచేవారని చీరాల యూనిట్ అధ్యక్షులు బత్తుల బ్రహ్మరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.అంజిరెడ్డి, పి.శ్రీనివాసరావు, రామిరెడ్డి, టి.నాగేశ్వరరావు, కె.సుధారాణి, ఎం.మీనా, టి.అనూష, సుధామణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణ



టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, ఎస్టీవో

చీరాల అర్బన్: ఏపీ ఎన్జీవోస్ చీరాల తాలూకా టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం స్థానిక డోలా ఐజక్ ఎన్జీఓ భవనంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ నేతాజీ, ఎస్టీఓ కె.భాగ్యలక్ష్మిలు హాజరయ్యారు. కార్యక్రమానికి చీరాల తాలూకా అధ్యక్షుడు చింతా శేషబాబు అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ నేతాజీ మాట్లాడుతూ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి రావల్సిన ఉద్యోగ బకాయిలను వెంటనే పొందాలన్నారు. అనంతరం అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు బి.అనిల్, ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, సౌభాగ్యలత, కె.చంద్రసేన్, రాధిక, ప్రసాద్, శ్రీనివాసరావు, కిషోర్, ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

అద్దంకి రూరల్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే భయపడాల్సిన అవసరం ఉండదని హెచ్‌సీజీ ఎంఎస్ఆర్ కాన్సర్ సెంటర్ వైద్య నిపుణులు ఎస్ రమణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గీతా మందిరంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ, భాస్కర్ సప్లయర్స్ శ్రీనివాసరావు సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణుడు ఎస్. రమణారెడ్డి మాట్లాడుతూ ఏదైన ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు కచ్చితంగా సరైన పరీక్షలు చేయించుకుని వైద్యుడి సూచనల మేరకు వైద్యం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు మలాది శ్రీనివాసరావు, సెక్రటరీ చప్పిడిరయ్య ట్రెజరర్ కొల్లా భువనేశ్వరీ, అద్దంకి లేవీ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు యు. దేవపాలన, నర్రా శ్రీలక్ష్మీ, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.